క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కారం



రాజాపూర్: మండలంలోని తిర్మలాపూర్ జీపీ పరిధిలోని నర్సంపల్లితండాలో తాగునీటి అవసరాలు తీరనున్నాయి. శుక్రవారం రంగారెడ్డిగూడ మాజీ సర్పంచ్ జనంపల్లి శశికళారెడ్డి బోరు డ్రిల్లింగ్ చేయించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌నాయక్, బచ్చిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణ, నారాయణనాయక్ పాల్గొన్నారు.

కుంట ధ్వంసం చేసిన వారిపై సీసీఎల్‌ఏలో ఫిర్యాదు

రాజాపూర్: మండల కేంద్రంలోని నాగులకుంటను ధ్వంసం చేసి వెంచర్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శుక్రవారం సామాజిక కార్యకర్త కొస్గి వెంకటయ్య సీసీఎల్‌లో ఫిర్యాదు చేశారు. మండలకేంద్రంలోని సర్వే నెంబర్ 284లో 9.30 ఎకరాల శిఖంల్యాండ్‌ను వెంచర్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఇచ్చిన ఎన్‌ఓసీని వెంటనే రద్దు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రేపు లింగబలిజల సమావేశం

మెట్టుగడ: పట్టణ వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 10:30 గంటలకు స్థానిక బోయపల్లి రోడ్డులోని తువ్వగుట్టపై ఉన్న బసవభవన్‌లో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు శివుడు, కార్యదర్శి శంకర్‌లింగం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ వీరశైవ లింగాయత్ లింగ బలిజ కులస్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కొత్తూర్‌లో వైద్య శిబిరం



మిడ్జిల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కొత్తూర్‌లో వైద్యశిబిరం నిర్వహించినట్లు వైద్యాధికారి శివకాంత్ తెలిపారు. ఈ శిబిరంలో వందమందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రసాద్, నరేశ్, దేవయ్య, చంద్రకళ, తిరుపతమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'పుర' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఇతర సిబ్బంది కలిపి మొత్తం 800 మంది పని చేస్తున్నారన్నారు. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలైనా వారికి అవసరమైన పరికరాలు ఇవ్వలేదన్నారు. వీరిలో 15మంది అనారోగ్యంతో బాధపడుతున్నందున తమ బదులు కుటుంబ సభ్యులను పనిలో ఉంచారన్నారు. కొంతమంది కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ ఖాతాల్లో పేర్లు, పుట్టిన తేదీలు తప్పుగా ఉన్నాయని, వెంటనే సరిచేయించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికిగాను ఈనెల 26న హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయాన్ని ముట్టడించనున్నామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్-వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎర్ర నర్సింహులు, సీఐటీయూ జిల్లా కోశాధికారి చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వరినాట్లతో నిరసన



ధన్వాడ: మండల కేంద్రంలో రోడ్లు అధ్వానంగా తయారవడంతో బీఆర్‌ఎస్ పార్టీ యువ నాయకులు రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఇర్ఫాన్ మాట్లాడుతూ ధన్వాడ నుంచి పాతపల్లి, కొత్తపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే సొంత కాలనీలో రోడ్డు అధ్వానంగా మారినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



నల్లకుంటను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిరబోయి

కలెక్టర్ విజయేందిర బోయి

జడ్చర్ల టౌన్: డెంగీ, మలేరియా, విషజ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. శుక్రవారం డ్రై డేను పురస్కరించుకుని మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు గౌరిశంకర్‌కాలనీ, 14వ వార్డు నాగర్‌కర్నూలు రోడ్డు, 6వ వార్డు పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. మున్సిపల్ సిబ్బంది చేపడుతున్న డ్రై డే కార్యక్రమాలను స్థానిక ప్రజలు, మున్సిపల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 3వ వార్డులో ఆర్‌పీలు, ఆశ, వార్డు అధికారులు పట్టణంలో ప్రజలకు చేపట్టిన అవగాహన కార్యక్రమాలపై ఆరాతీశారు. మున్సిపాలిటీ మాత్రమే కాకుండా ప్రజలు తమ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం లేకుండా ప్లాటు యజమానికి నోటీస్ జారీ చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. 14వ వార్డులో దుకాణాల ఎదుట వరదనీరు రోడ్డుపైకి వస్తున్నట్లు కాలనీవాసులు తెలియజేయగా.. డ్రెయినేజీ ద్వారా నీరు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నల్లకుంటను సందర్శించి ఇరిగేషన్ అధికారులతో సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్‌కు సూచించారు. నల్లకుంటలో కాల్వ, రోడ్డు నిర్మాణాలు ఎందుకు చేశారని ప్రశ్నించారు. 6వ వార్డులో ఇందిరమ్మ లబ్ధిదారులతో మాట్లాడారు. 6వ వార్డులోనే డెంగీ కేసునమోదైన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాతబస్టాండ్‌లో పేరుకుపోయిన చెత్తతో దుర్వాసన వస్తుందని కాలనీవాసులు ఫిర్యాదు చేయగా.. వెంటనే శుభ్రం చేయించాని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం జడ్చర్ల ఏరియా ఆస్పత్రిని సందర్శించి క్రిటికల్ కేర్ నిర్మాణాన్ని పరిశీలించారు. ఓపీ, ఇన్‌పేషెంట్ల గురించి తెలుసుకున్నారు. పాత ఆస్పత్రి నుంచి మార్చురీని వెంటనే షిఫ్ట్ చేయాలని సూచించారు. అనంతరం ఆగ్రోస్ రైతుసేవాకేంద్రం 2వ గోదాంలో ఎరువుల స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రకళ, తహసీల్దార్ నర్సింగ్‌రావు, చైర్‌పర్సన్ పుష్పలత, వార్డుకౌన్సిలర్లు ఉన్నారు.

హామీలు అమలు చేయాలని వినతి

పాలమూరు: కాంగ్రెస్ ప్రభుత్వం వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కలెక్టర్ విజయేందిర బోయికి బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. రూ.2లక్షల రుణమాఫీ, పది రకా పంటల బోనస్, రైతుభరోసా ఇలా అన్నిరకాల హామీలు అమలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, మురళీ కృష్ణ, నవీన్, రమేశ్ పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ పార్కు ప్రారంభం



చిల్డ్రన్స్ పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో రూ.ఐదు లక్షలతో నిర్మించిన చిల్డ్రన్స్ పార్కును శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో ముడా, మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో 20 పార్కులను అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాద్రీ, సీజే బెనహర్, సంజీవరెడ్డి, రాములుయాదవ్, అజ్మత్‌అలీ, హయాజ్, శ్రీనివాస్‌యాదవ్, జహీర్, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే మోడల్‌గా బీసీ కులగణన



మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్

టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్

స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో చేపట్టిన బీసీ కులగణన దేశంలో మోడల్‌గా నిలిచిందని టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుతో మాట్లాడారు. ఎవరు ఎంత జనాభానో వారికి అంతస్థాయిలో వాటా ఇవ్వాలన్న రాహుల్ గాంధీ ఆలోచన మేరకు రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టడం జరిగిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తున్నట్లు తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లలో మతపరమైన రిజర్వేషన్లు లేవన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తన హయాంలో బీసీ కమిషన్ ద్వారా సర్వే చేయించిన తర్వాతే ముస్లింలలో వెనుకబడిన వర్గాలను మాత్రమే బీసీ జాబితాలో చేర్చినట్లు పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల గురించి మాట్లాడే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదని విమర్శించారు. బీసీలకు ఉన్న 34శాతం రిజర్వేషన్లను 23శాతం చేసినప్పుడూ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. సమావేశంలో నాయకులు చంద్రకుమార్‌గౌడ్, సీజే బెనహర్, రాములు యాదవ్, అజ్మత్‌అలీ, అవేజ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాల సందర్శన

దేవరకద్ర రూరల్: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నరేశ్ బాబు, ప్రభుత్వ వైద్యుడు శరత్‌చంద్ర చౌదర్‌పల్లి సమీపంలోని మైనార్టీ గురుకుల కళాశాలను సందర్శించారు. కళాశాల గదులతోపాటు పరిసరాలను పరిశీలించారు. మురుగునీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. విద్యార్థుల సంఖ్య, విద్యార్థులకు అందిస్తున్న మోను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఓ సీత్యానాయక్, ప్రిన్సిపాల్ రహ్మతుల్లా, కోఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కళాశాల పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

నగరంలో ముమ్మరంగా ఫ్రైడే.. డ్రై డే



జిల్లాకేంద్రంలోని ఓ ఇంటి ఆవరణలో రసాయనాలు పిచికారీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది



కాకర్లపహడ్‌లో ఫీవర్ సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరంలో శుక్రవారం ఫ్రై డే.. డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ ఆశ కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది తిరిగి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆవరణలో నిల్వ నీటిని తొలగించి, సంప్‌లను శుభ్రం చేయించి ఫినాయిల్ చల్లించారు. అనంతరం దోమల నివారణకు రసాయనాలు పిచికారీ చేయించారు. వివిధ డివిజన్లలోని మురుగు గుంటల్లో ఆయిల్ బాల్స్ వేయించారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్యపరీక్షలు

స్థానిక రామయ్యబౌలిలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం సుమారు వందమంది పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

దేవరకద్ర రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు దోమల నివారణ కోసం మందులను వెదజల్లారు. శుక్రవారం డ్రైడే పురస్కరించుకుని నీటి నిల్వలు ఉన్నచోట దోమల నివారణ మందులను నీటిలో కలిపారు.

కాకర్లపహడ్‌లోఫీవర్ సర్వే

నవాబుపేట: మండలంలోని కాకర్లపహడ్‌లో శుక్రవారం మండల వైద్య సిబ్బంది ఫీవర్ సర్వే చేపట్టారు. వరుసగా గ్రామంలో డెంగీ, చికున్‌గున్యా వాధులు నమోదు కావడంతో సిబ్బంది ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, ఫీవర్ సర్వేను చేపట్టారు. డ్రైడే నిర్వహించి ప్రతిఇంట్లో నిల్వనీటిని పారబోసి ఆరోగ్య సూత్రాలు వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో 149 ఇండ్లల్లో సర్వే చేసి వారికి పరీక్షలు చేశారు. అనుమానితులకు రక్తపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాములు, బాలమణి, జయశ్రీ, విజయ, శ్రీనివాస్, రజిత, మాధవి, పద్మ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

చిన్నచింతకుంట: ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు శిరీష సూచించారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామాల్లోని వీధులు, ఇళ్ల పరిసరాలను పరిశీలించారు. కొళాయిలు, పూలతొట్లు, ఇంటి పరిసరాల్లో నిల్వ నీటిని పారబోయించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



పరిసరాలను పరిశీలిస్తున్న డాక్టర్ సుస్మిత

రాజాపూర్: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి సుస్మిత పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వార్డుల్లో పర్యటించి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఇంటి నిర్వాహకులకు సూచించారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో ఇంట్లో, ఇంటి ఆవరణలో నీటిని నిల్వచేసుకోరాదన్నారు. అంతేకాకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వేడిపదార్థాలను తీసుకోవాలని సూచించారు. మేయిల్ వర్కర్ వహీద్, ఆశ వర్కర్ సావిత్రి పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్

జడ్చర్ల టౌన్: మండలంలోని మాచారం సమీపంలో ఉన్న తెలంగాణ గిరిజన బాలుర డిగ్రి, పీజీ కళాశాలలో శుక్రవారం గంగాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 250మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మాత్రలు పంపిణీ చేశారు. పరిసరాలు, చేతుల శుభ్రతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రతాప్‌చౌహాన్, డాక్టర్ మాధురి, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం పోలేపల్లిలో నిర్వహించిన డ్రైడేలో పాల్గొని పరిసరాల శుభ్రత గురించి ప్రజలకు వివరించారు.

చిన్నారులకు స్వర్ణామృత ప్రాశన ఔషధం



చిన్నారికి చుక్కల మందు వేస్తున్న వైద్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం న్యూటౌన్‌లోని అప్టే స్మారక సమితి పాలమూరు ఆధ్వర్యంలో శుక్రవారం 16 ఏళ్ల లోపు చిన్నారులకు ఉచితంగా స్వర్ణామృత ప్రాశన ఔషధం (చుక్కల మందు) వేశారు. ఈ చుక్కల మందుతో పిల్లల్లో శారీరక, మానసిక ధృడత్వం, రోగ నిరోధకశక్తి, గ్రహణ, జ్ఞాపకశక్తి, మేధాశక్తి పెంపు, జలుబు, దగ్గులాంటి రుతు వాతావరణ కాల వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్ అనురాగ్, డాక్టర్ అరవింద్‌రెడ్డి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విభాగ్ ప్రముఖ్ ద్యాప వెంకట్‌రెడ్డి, ప్రచారక్ దేవేందర్ రాజు, జిల్లా సంఘ చాలక్ వసంతపు వెంకటేశ్వర్లు, కార్యదర్శి రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మూత్రపిండవ్యాధి నిర్ధారణ శిబిరం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఏగూర్ ఆస్పత్రిలో శనివారం ఉచిత కిడ్నీ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు డా. ఏగూర్ అంకిత్ తెలియజేశారు. శిబిరంలో కిడ్నీవ్యాధి నిపుణులు డా.అనంత్‌రావు పరీక్షలు చేస్తారని తెలిపారు. ఉచిత ఓపీడీ కన్సల్టేషన్, ఆరోగ్య తనిఖీ చేస్తారని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలయాలకు శ్రావణశోభ



వెంకటాయపల్లిలో రంగనాయక స్వామి పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు



పెద్దగుట్ట రంగనాథస్వామి ఆలయంపై ధ్వజారోహణం చేసిన భక్తులు

- ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- పలు ఆలయాల్లో అఖండ దీపారధన

దేవరకద్ర రూరల్: దేవరకద్రలోని వివిధ ఆలయాల్లో శుక్రవారం శ్రావణమాసం పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవరకద్రలోని శివాలయం, వీరప్పయ్యస్వామి ఆలయాల్లో ప్రత్యేకంగా తెచ్చిన జలంతో అభిషేకాలు నిర్వహించారు. శివాలయంలో శివలింగాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసి అఖండ దీపారాధన ప్రారంభించారు. అనంతరం వీరప్పయ్యస్వామి ఆలయంలో అఖండ దీపం వెలిగించారు. మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక కుంకుమార్చన, లలితా పారాయణం నిర్వహించి వాసవీమాత పల్లకీసేవ నిర్వహించారు. వెంకటాయపల్లిలో గుట్టపై వెలిసిన రంగనాయక స్వామి వెండి విగ్రహాన్ని రచ్చకట్ట వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలోని స్వామివారికి అర్చన, అభిషేకం అనంతరం అఖండదీపం వెలిగించారు.

పెద్దగుట్టపై శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభం

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పెద్దగుట్టపై రంగనాథ స్వామి ఆలయంలో శుక్రవారం శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాల్వరాంరెడ్డి, రాధిక దంపతులు, ధర్మజాగరణ సమితి సభ్యురాలు లావణ్య వేణుగోపాల్ దంపతులు గుట్టపై శాస్త్రోక్తంగా ధ్వజారోహణం జరిపించారు.

'అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వైద్య, ఆరోగ్య శాఖలో అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలని పబ్లిక్ హెల్త్ - మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్-3194 (ఐఎన్‌టీయూసీ అనుబంధం) జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, ప్రధాన కార్యదర్శి కుర్మయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతినెలా మొదటి వారంలోగా వేతనాలు ఇవ్వాలన్నారు. అధికారుల వేధింపులు నివారించాలని, ప్రభుత్వ ఆస్పత్రులకు రెగ్యులర్ సూపరింటెండెంట్‌ను నియమించాలని, మహిళా ఉద్యోగినులకు ప్రత్యేకంగా గదులను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో రామానాయుడు, సంతోష్‌కుమార్, బాబునాయక్, అశోక్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చిన్నచింతకుంట: బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ జిల్లా నాయకులు నంబి రాజు, కుర్వ రమేశ్, మండల అధ్యక్షుడు దశరత్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అందుకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. చిన్నచింతకుంట మండలంలో ఇప్పటికే ఉపాధి హామీ పథకం ద్వారా రూ.20కోట్లతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టిందన్నారు. ప్రస్తుతం ఎంపీ నిధుల నుంచి వాల్మీకి, ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ భవనాలకు రూ.18లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. కమ్యూనిటీ హాళ్లకు నిధులు మంజూరు చేయించినందుకు ఎంపీ డీకే అరుణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో అంజన్న, చంద్రుడు, రవి, సురేందర్, నర్సింహులు, నాగేశ్, చంద్రన్న, రాజు, బాలన్న, శ్రీను, వికాస్, నర్సింహ, చంద్రన్న, మాసన్న, రాజేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

5గ్రూపులకు రూ.56 లక్షల రుణం



మహిళలకు మంజూరు పత్రాలు అందజేస్తున్న టీజీబీ ఎఫ్‌ఓ రాకేశ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వంద రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా తాజాగా బ్యాంకు లింకేజీ కింద నగరంలోని ఐదు ఎస్‌హెచ్‌జీ లకు రూ.56 లక్షల రుణం మంజూరైంది. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టీజీబీ) మెట్టుగడ్డ బ్రాంచిలో మహిళలకు మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ రాకేశ్, మెప్మా సీఓ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లగడ్డలో ఇసుక అక్రమ రవాణా



ఓ ఇంటి వద్ద వీధిరోడ్డుపై కూరుకుపోయిన ఆటో

అడ్డాకుల: మూసాపేట మండలం తాళ్లగడ్డ నుంచి రాత్రిపూట ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. ఇక్కడ జానంపేట, తాళ్లగడ్డకు చెందిన ట్రాక్టర్లలో స్థానిక వాగునుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అయితే గ్రామంలోని ఇళ్లకు సమీపంలో ఇసుకను నిల్వ చేసి అక్కడి నుంచి ఇతర వాహనాలకు నింపుతున్నారు. దీనివల్ల ఇళ్ల వద్ద వీధిరోడ్లు పూర్తి అధ్వానంగా మారాయి. ఇళ్ల చుట్టూ ఇసుక నిల్వ చేయడంతో దాని కోసం వచ్చే వాహనాలతో వీధి రోడ్లు పాడైపోయాయి. కనీసం ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని విధంగా మారాయి. శుక్రవారం సాయంత్రం ఓ ఇంటికి వెళ్లే ఆటో మట్టిరోడ్డుపై కూరుకుపోయింది. ఇసుక కోసం వచ్చే వాహనాల మూలంగా ఇళ్ల పరిసరాల్లో రాత్రివేళ అలజడి నెలకొంటుందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వనమహోత్సవం టార్గెట్ పూర్తి చేయాలి



నవాబుపేటలో మొక్కలు నాటుతున్న అధికారులు, గ్రామస్తులు

నవాబుపేట: వనమహోత్సవం కార్యక్రమంలో గ్రామాలకు ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలకు 10 వేలకు తగ్గకుండా మొక్కలు నాటేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటికే సగానికి పైగా మొక్కలు నాటారని మిగతా వాటిని వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఈఓపీఆర్‌డీ నసీర్‌అహ్మద్, ఏపీఓ జ్యోతి, ఉపాధి సిబ్బంది జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రసత్యంకు ఘననివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, అభిమానులు

జడ్చర్ల టౌన్: జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే, దివంగత ఎర్రసత్యం జయంతిని శుక్రవారం జడ్చర్లలో ఆయన సోదరుడు, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎర్రసత్యం అభిమానులు పాల్గొన్నారు.

ఎర్ర సత్యం ఆశయాలు కొనసాగిస్తాం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జడ్చర్ల దివంగత మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం ఆశయాలను కొనసాగిస్తామని పండుగ సాయన్న సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణముదిరాజ్ పేర్కొన్నారు. ఎర్రసత్యం జయంతి సందర్భంగా శుక్రవారం మైత్రి జనతా గ్యారేజీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ చౌరస్తాలో నిరుపేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మురళీ, రాకేశ్, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్‌యాదవ్, ఆంజనేయులు, రెడ్డిరాములు, బాలగోపి, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉషా ఉమెన్స్ సిటీలీగ్‌కు విద్యార్థినుల ఎంపిక



ఉషా ఉమెన్స్ సిటీలీగ్‌కు ఎంపికైన విద్యార్థినులు

జడ్చర్ల టౌన్: సంగారెడ్డిలో ఆదివారం జరిగే ఖేలో ఇండియా ఉషా ఉమెన్స్ సిటీ లీగ్‌కు జిల్లానుంచి 11మంది విద్యార్థినులు ఎంపికైనట్లు ఉషా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ తాజుద్దీన్ తెలిపారు. శుక్రవారం జడ్చర్ల స్టేడియం మైదానంలో నిర్వహించిన ఎంపికలో జస్మిత, హరిక, సమన్వి, దీక్షిత, కారుణ్య, మేఘన, హర్షిత, లాస్య, సమీనాబేగం, శ్రీహర్షిత ఎంపికయ్యారని తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో ఉషా అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.